ఎన్ఇపికి వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలు

- ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మయూక్ బిస్వాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ నూతన విద్యా విధానానికి (ఎన్ఇపి) వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మయూక్ బిస్వాస్ హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ 17వ జాతీయ మహాసభలసందర్భంగా గురువారం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి తెచ్చిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఇపి) అంటే ఆదివాసీలు, దళితులు, మైనార్టీలు, పేద వర్గాలను విద్యకు దూరం చేసే నేషనల్ ఎక్స్‌క్లూజన్ పాలసీ అని విమర్శించారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేశారనీ, అందరికి మిడ్డే మీల్స్ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మైనార్టీలను విద్యకు దూరం చేసే కుట్రలో భాగంగా వారికిచ్చే ఉపకార వేతనాలను కేంద్రం రద్దు చేసిందని విమర్శించారు. ఎన్ఇపి అమలు చేయడం లేదని టిఆర్ఎస్ ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎన్ఇపిని అమలు చేయబోమంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాలలను మూసివేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మయూక్ బిస్వాస్

విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

రాష్ట్రంలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని మయూక్ బిస్వాస్ డిమాండ్ చేశారు. 18 ఏండ్లు దాటిన యువత దేశానికి, రాష్ట్రానికి పాలకులను నిర్ణయించే ఎన్నికల్లో భాగస్వాములవుతుండగా వారు చదువుకునే ప్రాంగణాలకు సంబంధించిన నిర్ణయాల్లో భాగస్వాములను చేయకపోవడమేంటని ప్రశ్నించారు. విద్యార్థి నాయకత్వం ఎదగకుండా చేయాలనకుంటే భవిష్యత్తులో దేశానికి నాయకుల కొరత ఏర్పడుతుందని హెచ్చరించారు. కేవలం విద్యను పూర్తి చేసుకుని డాక్టర్లు, ఇంజినీర్లు తదితరులు మాత్రమే ఉంటారని తెలిపారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా క్యూబా చేస్తున్న పోరాటానికి సంఘీభావం ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

గుజరాత్ మోడల్ అంటే...
స్కూళ్ల మూసివేత...విద్యార్థులపై నిర్బంధం - సత్యేషా

గుజరాత్ మోడల్ అంటే స్కూళ్ల మూసివేత, నిరుద్యోగ యువత ఆత్మహత్యలు, మైనార్టీలకు స్కూళ్లలో ప్రవేశాల నిరాకరణ, ఉద్యోగ పరీక్షల పేపర్ల లీకేజీ, మహిళలపై అత్యాచార బాధ్యులకు శిక్షలు పడకపోవడం, నిత్య నిర్బంధమని ఎస్ఎఫ్ఐ గుజరాత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, కేంద్ర కార్యవర్గ సభ్యులు సత్యేషా విమర్శించారు. ఆ రాష్ట్రం వికాస్ మోడల్ అంటూ బిజెపి చేస్తున్న ప్రచారమంతా వట్టిదేనని ఆమె కొట్టిపారేశారు. గత రెండేండ్ల కాలంలో విలీనం పేరుతో ఆరు వేల స్కూళ్లను మూసేశారని తెలిపారు. మైనార్టీలకు పాఠశాలల్లో ప్రవేశాలను నిరాకరిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగాల కోసం చదువుకున్న అభ్యర్థులకు పేపర్ల లీకేజీ పెద్ద సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 13 సార్లు పేపర్లు లీకయ్యాయంటే అక్కడి ప్రభుత్వం ఎంత సమర్థవంతంగా పని చేస్తున్నదో అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ యువత ఆత్మహత్యలు పెరిగాయని తెలిపారు. ఎస్‌సి విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతుల సమయంలో స్మార్ట్ ఫోన్ల సమస్య, పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడం వంటివి ఎదురవుతున్నాయని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయకుండా తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ సొంత రాష్ట్రం కావడం, గుజరాత్ మోడల్ దేశమంతా అమలు చేస్తామంటూ 2014లో బిజెపి కేంద్రంలో తొలిసారి అధికారంలోకి రావడం, గుజరాత్‌లో వాస్తవ పరిస్థితి దేశానికి తెలిస్తే బిజెపి చెప్పే అబద్ధాల ప్రచారం దేశ ప్రజలకు అవగతమవుతుందని భయపడుతున్నదని తెలిపారు. ఈ భయం కారణంగా అక్కడి విద్యార్థులు నిరసన తెలపకుండా, నిరసన తెలిపినా ఆ విషయాలు ప్రచారంలోకి రాకుండా ఆంక్షలను విధిస్తుందని చెప్పారు. మహిళల రక్షణ ఎండమావిగా మారిందన్నారు.

నిర్బంధానికి మారు పేరు జమ్ముకాశ్మీర్

జమ్ముకాశ్మీర్‌లో అన్నింటిపై నిర్బంధం కొనసాగుతున్నదని ఎస్ఎఫ్ఐ జమ్ముకాశ్మీర్ రాష్ట్ర కార్యదర్శి ఆకూబ్ యూసుఫ్ తెలిపారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత పరిస్థితి మరింత దిగజారిందన్నారు. ఫోన్లు, ఇంటర్నెట్ కట్ చేయడం దగ్గర నుంచి విద్యార్థి కార్యక్రమాలపై ఆంక్షలు విధిస్తున్నారని తెలిపారు. ఆ పరిమితుల మధ్య కూడా ఎస్ఎఫ్ఐ విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తున్నదని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ఎస్.కె.జాన్ భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు పాల్గొన్నారు.


ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశాలు

అదనపు పనికి అదనపు వేతనం ఎందుకివ్వరు?

- ఆశాల 48గంటల నిరవధిక ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆశా వర్కర్లు చేసే అదనపు పనులకు అదనపు వేతనం చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ కమ్యూనిటీ అండ్ హెల్త్ (ఆశా) వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో 48 గంటల నిరవధిక ధర్నా చేపట్టారు. ఖమ్మం నగరంలోని ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రదర్శనగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి వెళ్లి ఆందోళన చేపట్టారు. కార్యాలయం ఎదుట బైఠాయించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. అదనపు పనులు చేయించుకున్నప్పుడు అదనపు డబ్బులు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. అనంతరం డిఎంహెచ్ఒ మాలతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వర్లు, అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.రమ్య పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ధర్నా చౌక్ వద్ద వందలాది మంది ఆశా వర్కర్లు 48 గంటల నిరవధిక ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎజె రమేష్ ప్రారంభించి మాట్లాడారు. ప్రజల ప్రాణాన్ని రక్షిస్తున్న ఆశా వర్కర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం జరుగుతున్న పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందన్నారు. ఆశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట 48 గంటల ధర్నా ప్రారంభించారు.

వండర్‌లా క్రిస్మస్ రాయితీ ఆఫర్

హైదరాబాద్ : ప్రముఖ అమ్యూజ్‌మెంట్ పార్క్ వండర్‌లా హాలీడేస్ క్రిస్మస్ పండగ సందర్భంగా రాయితీపై ప్రవేశం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లోని వండర్‌లాలో డిసెంబర్ 24 నుంచి జనవరి 01వ తేదీ వరకు.. వారం రోజులపాటు జరిగే ఈ వేడుకలలో లైవ్ షోస్, సీజనల్ స్వీట్లు, ట్రీట్స్, పండుగ అలంకరణలు, ప్రకాశవంతమైన విద్యుత్ దీపాలు, ఫుడ్ ఫెస్ట్, వినోద క్రీడలు, డిజె, ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. దీనిలో భాగంగా ఐదు రోజుల ముందు టికెట్లు బుక్ చేసుకున్న వారికి 10 శాతం, 22 ఏళ్ల లోపు కాలేజీ విద్యార్థులకు 20 శాతం తగ్గింపును ఇస్తున్నట్లు తెలిపింది.

కెనరా బ్యాంక్ రిటైల్ ఎక్స్‌పో

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ హైదరాబాద్-2 రీజినల్ ఆఫీసు ఎంజె మార్కెట్ సమీపంలో మెగా రిటైల్ ఎక్స్‌పోను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. బుధవారం కెనరా బ్యాంక్ హైదరాబాద్ సర్కిల్ ఆఫీసు జనరల్ మేనేజర్ అనురాధ ప్రారంభించి.. ఆ బ్యాంక్ అందిస్తున్న పథకాలు, బ్యాంకింగ్ సేవల గురించి వివరించారు. ప్రాసెసింగ్ ఛార్జీలు లేకుండా పోటీ వడ్డీ రేట్లతో గృహ, వాహన, కుదువ రుణాలను అందిస్తుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.2,000 కోట్ల రిటైల్ రుణాలను మంజూరు చేసినట్లు వెల్లడించారు. విదేశీ విద్యా రుణాల జారీలోనూ ముందున్నామన్నారు. ఇక్కడ జరిగిన ఎక్స్‌పోలో పలువురు గృహ, వాహన, విద్యా రుణ గ్రహీతలకు ఆమె చెక్కులను అందజేశారు.

ఆర్‌వి యూనివర్శిటీలో ప్రవేశాలకు దరఖాస్తులు


హైదరాబాద్ : 2023-24కు విద్యా సంవత్సరానికిగాను విద్యార్థుల నుంచి ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న ఆర్‌వి యూనివర్శిటీ తెలిపింది. పలు విభాగాల్లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ల కోసం ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొంది.

గిరిజనులకు రక్షిత మంచినీరు కల్పన

- ఎస్‌బిఐ రూ.38.20 లక్షల విరాళం

ప్రజాశక్తి - హైదరాబాద్

చెరువులు, వాగులు, కాలువల నుంచి అపరిశుభ్రమైన నీటిని తాగుతున్న గిరిజనులకు రక్షిత మంచినీటిని అందించడానికి ఎస్‌బిఐ అమరావతి సర్కిల్ రూ.38.20 లక్షలు విరాళంగా అందించింది. ఈ ప్రాజెక్ట్ మారేడిమిల్లి దండకారణ్యంలోని రంపచోడవరం అటవీ ప్రాంతంలోని 20 గిరిజన గ్రామాల్లో చేతి పంపులతో 20 లోతైన బోర్‌వెల్‌లను ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందిస్తుంది. ఈ గ్రామాల్లోని గిరిజనులు సురక్షితమైన తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. రక్షిత మంచినీరు లేక చెరువులు, వాగులు, కాల్వలపై ఆధారపడి అపరిశుభ్రమైన నీటిని తీసుకువస్తున్నారు. ఆయా గ్రామాలకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద ఎస్‌బిఐ ఈ సాయం అందించింది. గన్‌ఫౌండ్రీలోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అమరావతి చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్‌చంద్ర ఝా సమక్షంలో అవేర్ ఎన్‌జిఒ చైర్మన్ డాక్టర్ పికెఎస్ మాధవన్‌కు ఆ బ్యాంకు ఐబి, జిఎం అండ్ టి మేనేజింగ్ డైరెక్టర్ చల్లాశ్రీనివాసులు సెట్టి చెక్కును అందజేశారు.



విస్కిన్సిన్ యూనివర్సిటీ, ఇఎంఆర్ఐ ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోని జంతువులకు ఆరోగ్య సేవలందించేందుకు యూఎస్ఏకు చెందిన విస్కిన్సిన్ యూనివర్సిటీ (మ్యాడిసన్)తో ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ (జీవీకే ఈఎంఆర్ఐ) ఒప్పందం చేసుకున్నది. గురువారం హైదరాబాద్ కొంపల్లిలోని ఈఎంఆర్ఐ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో జివికె ఈఎంఆర్ఐ డైరెక్టర్ కె.కృష్ణంరాజు, విస్కిన్సిన్ స్కూల్ ఆఫ్ వెటర్నరీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ క్రిష్టఫర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మేరకు రానున్న ఐదేండ్ల కాలంలో పశు వైద్యులకు, మొబైల్ వెటర్నరీ అంబులెన్స్ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ 1,962 మొబైల్ మెడికల్ యూనిట్లు పని చేస్తున్నాయని తెలిపారు. తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో 800 జంతువుల అంబులెన్సులు నడిపిస్తున్నామనీ, అత్యవసర పరిస్థితుల్లో ఇంటి వద్దకే వెళ్లి చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు. ఈఎంఆర్ఐతో ఒప్పందం చేసుకోవడం పట్ల క్రిష్టఫర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జివికె ఈఎంఆర్ఐ జీహెచ్ఎస్ అధ్యక్షులు సుబోధ్ సత్యవాది, జివికె ఈఎంఎల్‌సీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ జీ.వీ.రమణ రావు, జివికె ఈఎంఆర్ఐ 1962 మొబైల్ వెటర్నరీ సర్వీసెస్ రాష్ట్ర సీఒఒ ఖలీద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో తీర్పు రిజర్వు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మెయినాబాద్ ఫాంహౌస్‌లో టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను బిజెపి కొనుగోలుకు ప్రయత్నించారంటూ పోలీసులు నమోదు చేసిన కేసు దర్యాప్తు సిబిఐకి ఇవ్వాలని దాఖలైన కేసుల్లో హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, నిందితులు రామచంద్రభారతి, శ్రీనివాస్, సింహయాజి, నందకుమార్, తుషార్ ఇతరులు వేసిన పిటిషన్లపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణను ముగించారు. ఎమ్మెల్యేల ఎర కేసు దర్యాప్తు పూర్తి కాకుండా అడ్డుకునే అధికారం కోర్టులకు లేదని రాష్ట్ర ప్రభుత్వం, సిట్‌ల తరపున ఏజీ బీఎస్ ప్రసాద్ వాదించారు. క్రిమినల్ కేసుల్లో దర్యాప్తును ప్రాథమిక దశలో అడ్డుకునే అధికారం కోర్టులకు లేదని సుప్రీంకోర్టు... అరుణబ్‌గోస్వామి కేసులో తీర్పు చెప్పిందన్నారు. పోలీసులు దర్యాప్తును పూర్తి చేసి కింది కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసే వరకు కోర్టులకు ప్రమేయం చాలా అరుదుగా ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు కుట్ర చేసిన వాళ్లకు రాజ్యాంగం ప్రకారం రక్షణ కల్పించవద్దన్నారు. పోలీసులు నమోదు చేసిన కేసును అవినీతి కేసును సాధారణ పోలీసులు దర్యాప్తు చేయడానికి వీల్లేదని, ఎసిబి విచారణ చేయాలని పిటిషనర్లు చేసిన వాదన చట్ట వ్యతిరేకమన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు చేయడం ద్వారా ప్రజా తీర్పును కాలరాసేందుకు కుట్ర చేసిన వారికి, తెర వెనుక మద్దతు తెలిపే వారిపై సిట్ విచారణ కొనసాగేందుకు వీలుగా పిటిషన్లు కొట్టేయాలని కోరారు. పిటిషనర్ అనుమానిస్తున్నట్టుగా నిజంగానే ఎమ్మెల్యే కొనుగోలు కుట్ర కేసు వెనుక రాజకీయ దురుద్దేశం ఉన్నప్పటికీ క్రిమినల్ కేసు దర్యాప్తును ప్రాథమిక దశలో అడ్డుకునే హక్కు ఎవరికీ ఉండదన్నారు. ఈ కేసులో నిందితులు ఫలానా దర్యాప్తు సంస్థకు కేసు అప్పటించాలని అభ్యర్థించడం విడ్డూరంగా ఉందని తెలిపారు. సిబిఐ లేదా స్వతంత్ర దర్యాప్తు సంస్థకు కేసును బదిలీ చేయాలని కోరే హక్కు నిందితులు, ఫిర్యాదుదారుడు, పిటిషనర్లకు ఎప్పటికీ ఉండబోదని వివరించారు. క్రిమినల్ కేసుల్లో నిందితులకే చట్టంలో రక్షణ ఉంటుందని, చార్జిషీట్ దాఖలు చేసే వరకు నిందితులు కూడా వేచి ఉండాలని చెప్పారు. చార్జిషీట్ దాఖలు చేశాక కింది కోర్టులో విచారణను సవాల్ చేసే హక్కు చట్టంలో ఉందన్నారు.

విద్యార్థులను అలరించిన 'అందర్-బాహర్'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న జాతీయ నూతన విద్యావిధానం (ఎన్ఇపి)పై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రోగ్రెసివ్ థియేటర్ గ్రూప్ ఆధ్వర్యంలో విద్యార్థులు "అందర్ -బాహర్ వీధి నాటిక"ను ప్రదర్శించారు. ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభ సందర్భంగా గురువారం ఒయు ఆర్ట్స్ కళాశాల ఎదుట ప్రదర్శించిన ఈ నాటకానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. బిజెపి అధికారంలోకి రాగానే రైల్వేలు, బిఎస్ఎన్ఎల్, విశాఖ స్టీల్‌తోపాటు అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేసిందని ఈ నాటకం ద్వారా తెలిపారు. అలాగే, ఎన్ఇపి ద్వారా విద్యను పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు పూనుకుందని వివరించారు. ఈ నూతన విద్యావిధానం ద్వారా రిజర్వేషన్, ఫెలోషిప్, సామాజిక న్యాయం ఉండదని తెలిపారు. మరోవైపు మనువాదాన్ని విద్యాసంస్థల్లో చొప్పించేందుకు ఆర్ఎస్ఎస్, బిజెపి చేస్తున్న ప్రయత్నాలను నాటిక కళ్లకు కట్టింది. ఠాగూర్ ఆడిటోరియం ముందూ నాటికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ నేతలు వీరయ్య, రాములు, ఒయు ప్రొఫెసర్ డా నాగేశ్వర్‌రావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి మాట్లాడారు. ఒయు వేదికగా ఎన్నో చరిత్రాత్మక ఉద్యమాలు జరిగాయన్నారు. అదే స్ఫూర్తితో నూతన జాతీయ విద్యా విధానం అమలు కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఇప్పుడే ఉన్నత విద్యా రంగాల్లో రాణిస్తున్న వెనుకబడిన వర్గాలను మళ్లీ విద్యకు దూరం చేసి, వారి వారి గత వృత్తులకే పరిమితం చేయాలని బిజెపి యోచిస్తోందన్నారు. విద్యార్థులు విద్యారంగ పరిరక్షణకు ఉద్యమించాలని.. అందుకు ఎస్ఎఫ్ఐ 17వ మహాసభ వేదికగా తీర్మానాలు చేస్తోందన్నారు. అనంతరం, ఇటీవల అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలిచిన విద్యార్థులు సంధ్య, స్వప్నిల్, సుప్రియ, గణేష్‌కు బహుమతులు అందజేశారు. నాటికను ప్రదర్శించిన వారిలో జాన్ బషీర్, కిర్ప, అభిషేక్ నందన్, శిరీష, నవమి, అభిషేక్, గిరీష్ బాబు, శివ, అజయ్, ఔరిస్మిత ఉన్నారు. ఎస్ఎఫ్ఐ ఒయు అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి రవి నాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో టోటల్ ఎనర్జీ 100వ డిస్పెన్సింగ్ స్టేషన్

హైదరాబాద్ : టోటల్ ఎనర్జీస్ అనుబంధ సంస్థ అయిన టోటల్ ఎనర్జీస్ మార్కెటింగ్ ఇండియా తెలంగాణలో తన 100వ ఆటో ఎల్‌పిజి డిస్పెన్సింగ్ స్టేషన్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. దీన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపింది. "రవాణా ఇంధనంగా ఆటో ఎల్‌పిజి అనేక సాటిలేని ప్రయోజనాలను అందిస్తుంది. వాహన ఉద్గారాల కారణంగా నగరాల్లో గాలి కలుషితం కావడం అనే తక్షణ సమస్యకు తక్షణ పరిష్కారం ఇది. రిటైల్ మార్కెటింగ్‌లో టోటల్ ఎనర్జీస్ ప్రపంచ నైపుణ్యంతో మేం దక్షిణ భారతదేశంలోని మా అన్ని స్టేషన్‌లలో అత్యుత్తమ ఉత్పత్తి నాణ్యతను, సాటిలేని కస్టమర్ అనుభవాన్ని అందిస్తాం" అని ఆ సంస్థ సిఎండి ఒలివియర్ సబ్రీ పేర్కొన్నారు.

అక్రమ నిర్బంధం.. పరిహారం ఇవ్వాలి..

రాష్ట్రానికి నోటీసులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ వార్ రూమ్‌పై పోలీసులు చట్ట వ్యతిరేకంగా దాడి చేసి అక్కడ పనిచేసే ముగ్గురినీ అక్రమంగా అరెస్టు చేశారని పేర్కొంటూ ఆ పార్టీ హైకోర్టులో దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌లో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డిజిపి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, సైబర్ క్రైం ఎసిపి, సిఐలతోపాటు ప్రసాద్-ఎసిపి, సైబర్ క్రైం సిఐ రమేష్‌లకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ జె.శ్రీదేవిల డివిజన్ బెంచ్ గురువారం ఆదేశించింది. మాజీ ఎంపీ మల్లు రవి తరపున అడ్వకేట్ రజనీకాంత్‌రెడ్డి వాదిస్తూ, మాదాపూర్‌లోని కాంగ్రెస్ వార్ రూమ్ నుంచి తీసుకువెళ్లిన ముగ్గురిని 18 గంటలపాటు పోలీసులు అక్రమంగా నిర్బంధించారని చెపారు. మాదాపూర్ ఇనార్బిట్‌మాల్‌లోని నాలుగో అంతస్తులో పనిచేసే ఇషాన్ శర్మ, టి. శశాంక్, మండ ప్రతాప్‌లను పోలీసులు ఈ నెల 13న రాత్రి 10.45 గంటలకు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. వారు ఏకపక్షంగా, చట్ట వ్యతిరేకంగా, రాజ్యాంగ హక్కులను కాలరాసే విధంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ముగ్గురు బాధితులకు రూ.20 లక్షలు చొప్పున పరిహారం చెల్లించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసిన వివరాలుగానీ నోటీసుగానీ ఏమీ ఇవ్వలేదన్నారు. ఆ ముగ్గురిని అక్రమంగా అదుపులోకి తీసుకున్నారనీ, వాళ్లపై గతంలో ఏవిధమైన కేసులు లేవనీ, అరెస్టుకు కారణాలు తెలుపుతూ సీఆర్‌పీసీలోని 50 సెక్షన్ కింద నోటీసు కూడా ఇవ్వలేదని చెప్పారు. పోలీసుల చర్య రాజ్యాంగంలోని 21వ అధికరణానికి తూట్లు పొడవడమేనని అన్నారు. వారిపై ఎలాంటి కేసులు ఉన్నాయనే విషయాన్ని పోలీసులు అడిగినా చెప్పలేదన్నారు. చట్ట ప్రకారం ఏడేండ్లలోపు శిక్షలు పడే కేసుల్లో సీఆర్‌పీసీ 41ఎ సెక్షన్ కింద నోటీసు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులను తుంగలోకి తొక్కారని ఆరోపించారు. 2023లో అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వారంతా మాదాపూర్‌లో నిర్వహిస్తున్న ఆఫీసులో టిపిసిసి కోసం వ్యూహాత్మక ఫ్రేమ్ వర్క్ చేస్తుంటారని వివరించారు. ఎన్నికల సర్వేలు, రాజకీయ వ్యూహాలు, ఎత్తుగడల రచన, ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన విధానాలు, పీఆర్, మీడియా మేనేజిమెంట్ వంటి వాటిపై కసరత్తు చేస్తుంటారని చెప్పారు. ఇతర పార్టీలు కూడా ఈ విధంగా చేయడం పరిపాటేననీ, అయినా పోలీసులు వచ్చి అన్యాయంగా వ్యవహరించారని చెప్పారు.

రాష్ట్రంలో త్వరలో నిర్వహించబోయే గ్రూప్-2, గ్రూప్-4 పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఈనెల 18,19 తేదీల్లో ఉచిత అవగాహన, డెమో క్లాసులను నిర్వహిస్తున్నట్టు విజయసాధన స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె గంగా కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మోడీ పాలనలో వినాశనం

- ఐక్య పోరాటాలతో విద్యారంగ పరిరక్షణ
- రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో ఎన్ఇపిని అడ్డుకోవాలి
- సేవ్ ఎడ్యుకేషన్... సేవ్ ఇండియా నినాదంతో ముందుకు
- ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభలో వామపక్ష, ప్రజాతంత్ర విద్యార్థి సంఘాల నేతల పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న మోడీ పాలనకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాల ద్వారా ముందుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉందని వామపక్ష, ప్రజాతంత్ర విద్యార్థి సంఘాల జాతీయ నాయకులు నొక్కి చెప్పారు. విద్యను కాషాయీకరణ, ప్రయివేటీకరణ చేసే ఎత్తుగడతో తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా ఢిల్లీ రైతాంగ ఉద్యమస్ఫూర్తితో పోరాటాన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సేవ్ ఎడ్యుకేషన్..సేవ్ ఇండియా నినాదంతో ముక్తకంఠంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని మల్లు స్వరాజ్యం నగర్ (ఒయు)లో గల అభిమన్యు-ధీరజ్-అనీష్‌ఖాన్ వేదికలో సాగుతున్న స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత 17 మహాసభకు వారు గురువారం హాజరయ్యారు. తమ సంఘాల తరఫున సౌహార్ద్ర సందేశాన్ని ఇచ్చారు. క్యూబా, బంగ్లాదేశ్, పాలస్తీనాలకు చెందిన విద్యార్థి సంఘాల నాయకులు మహాసభలో మాట్లాడారు. పలు దేశాల విద్యార్థి సంఘాల నాయకులు తమ సందేశాన్ని వీడియోల రూపంలో పంపారు.

ఎన్ఇపికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమం : విక్కీ మహేశరి

న్యూ ఎడ్యుకేషన్ పాలసీకి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోనున్నట్టు ఎఐఎస్ఎఫ్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి విక్కీ మహేశరి అన్నారు. ఢిల్లీలో రైతుల పోరాటాన్ని అణచివేయాలని మోడీ సర్కారు చూస్తే వారు ఒక్కడుగు కూడా వెనక్కి వేయలేదన్నారు. రైతుల పోరాట స్ఫూర్తితో ఎన్ఇపికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని వామపక్ష, ప్రజాతంత్ర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ముందుకు తీసుకుపోతామని చెప్పారు. పీపుల్స్ ఎడ్యుకేషన్ సిస్టమ్ కోసం పోరాడుతామన్నారు.

జీవించే హక్కును మోడీ సర్కారు కాలరాస్తోంది : ప్రసేన్‌జిత్

మోడీ సర్కారు దేశంలో విద్యార్థి ఉద్యమంపై ఉక్కుపాదం మోపుతోందని ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఎఐఎస్ఎ) నేత ప్రసేన్‌జిత్ విమర్శించారు. జామియాలో విద్యార్థుల పోరాటాన్ని అణచివేసిందన్నారు. జమ్మూకాశ్మీర్ ప్రజల జీవించే హక్కును కాలరాస్తోందని విమర్శించారు. ఆదివాసీ, మహిళా, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలపైనా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదన్నారు. ఆర్ఎస్ఎస్, మోడీ సర్కారుకు అడ్డుకట్ట వేసేందుకు విద్యార్థి పోరాటాన్ని సంఘటితంగా ముందుకు తీసుకెళ్తామని హామీనిచ్చారు.

విద్యారంగ ప్రయివేటీకరణకే ఎన్ఈపీ : ఎమ్‌డి షఫియుల్లా

మోడీ, అమిత్‌షా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల మాదిరిగానే విద్యారంగాన్ని కూడా పూర్తిగా ప్రయివేటుపరం చేసేందుకు నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని పిడిఎస్‌యు ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి షఫియుల్లా విమర్శించారు. వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమం ఐక్యంగా ముందుకు సాగాలనీ, అందులో ఎస్ఎఫ్ఐ కీలక భూమిక పోషించాలని ఆకాంక్షించారు. హిందీ, హిందూ, హిందూస్థానీ కోసం బీజేపీ యత్నిస్తున్నదని విమర్శించారు. దీన్ని తిప్పికొట్టేందుకుగానూ అందరికీ తిండీ, బట్ట, ఇల్లు నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

దేశంలో ఫాసిస్ట్ సంస్కృతి వ్యాప్తి : కె.ఎస్. అశ్విని

కేంద్ర ప్రభుత్వం ఫాసిస్ట్ సంస్కృతిని వ్యాప్తి చేస్తోందని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎఐడిఎస్ఒ) అధ్యక్షులు కెఎస్.అశ్విని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి తన గుప్పిట్లోకి తీసుకుంటున్నదని విమర్శించారు. మహనీయుల చరిత్రను పుస్తకాల నుంచి తప్పిస్తున్నదన్నారు. విద్యార్థులను ఆలోచించకుండా మరయంత్రాలుగా మార్చే విధానానికి పూనుకుందని విమర్శించారు. విద్యార్థులను డ్రగ్స్, ఆల్కహాల్, ఇతర వ్యసనాలకు అలవాటు చేస్తున్న దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యకు బడ్జెట్ కేటాయింపు, ఖర్చు అంతంతేనన్నారు. శాస్త్రీయ విద్యావిధానం, సోషలిజం సాధన దిశగా పోరాటాల కార్యాచరణ ఉండాలని ఆకాంక్షించారు.

ప్రజాస్వామ్య సమాజం కోసం పోరాటం
క్యూబా విద్యార్థి సంఘం నేత మెలినా లోహజ్

ప్రజాస్వామ్య సమాజం కోసం విద్యార్థులు, అభ్యుదయవాదులు పోరాడాలని క్యూబా విద్యార్థి సంఘం నేత మెలినా లొహజ్ అన్నారు. క్యూబాలో శాస్త్రీయ విధానంలో విద్య బోధన జరుగుతుందని చెప్పారు. విద్యావిధానంలో నియంతృత్వ పోకడలు ఏదేశానికైనా మంచిది కాదన్నారు. విద్యారంగ పరిరక్షణ, సామ్యవాద స్థాపన దిశగా విద్యార్థి సంఘాలు సమాలోచనలు చేయాలన్నారు.

ప్రోగ్రెసివ్ నాయకత్వం ప్రపంచమంతటా విస్తరించాలి
బంగ్లాదేశ్ స్టూడెంట్ యూనియన్(బిఎస్‌యు) ప్రధాన కార్యదర్శి దీపక్‌సేన్

ప్రపంచమంతటా ప్రోగ్రెసివ్ నాయకత్వం బలపడుతోందని బంగ్లాదేశ్ స్టూడెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దీపక్‌సేన్ ఆకాంక్షించారు. సోషలిజం రావాలని కోరుకుంటున్నామన్నారు. చారిత్రాత్మకంగా చూస్తే భారత్, బంగ్లాదేశ్ మూలాలు ఒక్కటేనన్నారు. ఇక్కడ విద్యార్థి ఉద్యమాలపై అణచివేత ఎలా ఉందో తమ దేశంలోనూ అలాగే ఉందని చెప్పారు. పాలకుల విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐకి అభినందనలు
స్టూడెంట్ యూనియన్ ఆఫ్ బంగ్లాదేశ్(ఎస్‌యుబి) ప్రధాన కార్యదర్శి అదితి

విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐకి అభినందనలు తెలుపుతున్నట్టు స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ బంగ్లాదేశ్ ప్రధాన కార్యదర్శి అదితి చెప్పారు. బంగ్లాదేశ్ విద్యార్థి ఉద్యమంలో తమ సంఘం కీలక పాత్ర పోషిస్తున్నదని చెప్పారు. ప్రయివేటీకరణతో విద్య ఖరీదైపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ ఎలాగైతే ఉద్యమాలను అణచివేస్తున్నారో తమ దగ్గరా అదే పరిస్థితి ఉందన్నారు. అనాలోచిత విద్యావిధానాల వల్లే నిరుద్యోగ సమస్య పెరుగుతోందని చెప్పారు. "ఎడ్యుకేషన్ ఫర్ ఆల్..ఎంప్లాయిమెంట్ ఫర్ ఆల్..యునైటెడ్ ఫర్ ఆల్" నినాదంతో ముందుకెళ్తున్న ఎస్ఎఫ్ఐకి అభినందనలు తెలిపారు.

సమానత్వం కోసం కొట్లాడుతున్నాం
పాలస్తీనా బిడిఎస్ నేత అపూర్వ గౌతమ్

తమ దేశంలో సమానత్వం కోసం పోరాడుతున్నామని పాలస్తీనా, బిడిఎస్ నేత అపూర్వ గౌతమ్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభకు విప్లవాభివందనాలు తెలిపారు. పాలస్తీనాలో క్షేత్రస్థాయిలో ప్రజలకు అండగా ఉంటూ మానవ హక్కుల కోసం పోరాడుతున్నామన్నారు. ప్రపంచమంతా వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలు బలపడాలని ఆకాంక్షించారు. ఎన్ఇపికి వ్యతిరేకంగా బలమైన పోరాటాలు చేయాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ మహాసభల్లో భారత విద్యారంగ పరిరక్షణకు నిర్ణయాలు జరగాలని.. ప్రజాస్వామ్యం,సామ్యవాదం నినదించాలని ఆకాంక్షిస్తూ పలు దేశాలకు చెందిన విద్యార్థి సంఘాల నేతలు పంపిన వీడియో సందేశాలను మహాసభలో ప్రదర్శించారు.

జటిలంగా 'నారాయణపూర్' గండి సమస్య

- పూడ్చొద్దంటున్న నిర్వాసితులు..
- సాగునీరు కావాలంటున్న రైతులు
- 'కాళేశ్వరం' నీళ్లు రావాలంటే ఈ రిజర్వాయరే దిక్కు!
- గండి పూడ్చకపోతే 1.65లక్షల ఎకరాల సాగు ప్రశ్నార్థకం
- ఆందోళనలో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల రైతాంగం
- పరిష్కరించకపోతే ఎండాకాలం తాగునీటికి ఇక్కట్లే.. !



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నారాయణపూర్ రిజర్వాయర్ సమస్య జటిలంగా మారింది. మొన్నటి భారీ వర్షాలకు రిజర్వాయర్‌కు గండి పడి చుక్కనీరు లేకుండా పోయింది. యాసంగికి సాగు నీరందించేందుకు గండి పూడ్చాలని ఆయకట్టు రైతులు ఆందోళన చేస్తుండగా.. మరోవైపు పరిహారం విషయం తేల్చేవరకు మరమ్మతులు చేపట్టొద్దని ముంపు గ్రామాల ప్రజలు భీష్మించుకూర్చున్నారు. కాళేశ్వరం నీళ్లు రావాలంటే ఈ రిజర్వాయరే దిక్కు. గండి పూడ్చకపోతే 1.65 లక్షల ఎకరాల సాగు ప్రశ్నార్థకం కానుంది. తాగునీటికీ ఇక్కట్లు ఏర్పడనున్నాయి.

కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాల పరిధిలోని సుమారు 1.65లక్షల ఎకరాల సాగుకు చొప్పదండి నియోజకవర్గం లోని నారాయణపూర్ రిజర్వాయరే దిక్కు!. కాళేశ్వరం నుంచి ఎత్తిపోసిన నీటిని ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా ఈ రిజర్వాయర్‌కు పంపింగ్ చేసి యాంసంగికి నీళ్లందిస్తున్నారు. గతంలోనే రిజర్వాయర్ కట్టను 1.4మీటర్ల ఎత్తుకు పెంచి 0.3 టిఎంసిల అదనపు నీటిని నిల్వ చేసేందుకు సర్కారు రూ.24.10కోట్లు మంజూరు చేసింది. అయితే, కట్ట పెరగడంతో ముంపునకు గురవుతున్న నిర్వాసితులకు పరిహారం అందించలేదు. సరికదా.. ఈ రిజర్వాయర్‌కు మొన్నటి భారీ వర్షాలకు గండి పడి సుమారు ఐదారు ఊర్లు నీటమునిగాయి. కట్టుబట్టలతో జనం పునరావాస కేంద్రాల్లో బిక్కుబిక్కుమంటూ గడిపారు. గండి వల్ల ప్రస్తుతం రిజర్వాయర్‌లో చుక్కనీరు లేదు. ఇప్పుడు యాసంగికి నీళ్లందించేం దుకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు ఆందోళన చేస్తుంటే.. తమ పరిహారం సంగతి తేల్చాకే గండి పూడ్చాలని ముంపు గ్రామాలు భీష్మించాయి.

11 ఏండ్ల కిందట ఎల్లంపల్లి ఫేస్ 1, ఫేస్ 2 కింద రిజర్వాయర్ కోసం భూసేకరణ చేశారు. అప్పట్లోనే ముంపు ఇండ్లకు నష్ట పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఏళ్లు గడుస్తున్నా.. ఆ హామీ గురించి మాట్లాడకుండా రిజర్వాయర్ ను పూర్తి చేశారు. దీంతో ప్రతి వర్షాకాలంలో రిజర్వాయర్‌కు వస్తున్న భారీ వరదతో సమీప గ్రామాల్లోకి నీళ్లు వస్తున్నాయి. మొన్నటి వానాకాలం భారీ వర్షాలకు నారాయణపూర్ రిజర్వాయర్ సహా దాని కింద ఉన్న గంగాధర చెరువుకూ గండి పడింది. దీంతో దాని సమీపంలోని ఐదు ఊర్లు నీట మునిగాయి. రోడ్లు ధ్వంసమయ్యాయి. కట్టుబట్టలతో ఆయా గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. ముఖ్యంగా నారాయణపూర్, మంగపేట, చర్లపల్లి ఎన్ గ్రామాల్లో కొందరు ఇప్పటికీ ఊర్లు విడిచి పక్క గ్రామాల్లో తలదాచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నారా యణపూర్, చర్లపల్లి(ఎన్), మంగపేట గ్రామాల్లో 240 ఎకరాలు, నారాయణపూర్‌లో 25 ఇళ్లు, మంగపేటలో 11 ఇళ్లు, చర్లపల్లిలో కొన్ని ఇళ్లు ముంపునకు గురవుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ ఇళ్ల యజమానులకు ఇప్పటివరకు పరిహారం అందలేదు. మంగపేటలో 87.16 ఎకరాల సాగుభూమి, 40 వ్యవసాయ బావులు, 11 ఇండ్లకు నాలుగేండ్ల కిందట అవార్డు ఎంక్వైరీ చేసి నిర్వాసితులు సంతకాలు చేసినా ఇంతవరకు పరిహారం అంద లేదు. దీంతో ఇప్పుడు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేస్తే మళ్లీ ముంపు సమస్య వస్తుందని, తమకు రావాల్సిన రూ.16.50కోట్ల పరిహారం అందించాకే పూడ్చాలని నిర్వాసితులు భీష్మించారు. గతంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుటా ఆందోళన చేశారు.

ప్రశ్నార్థకంగా 1.65లక్షల ఎకరాలు

మూడు జిల్లాల పరిధిలోని పలు గ్రామాల్లో సుమారు 1.65లక్షల ఎకరాలకు గంగాధర, నారాయణపూర్ జలాశయాల నుంచి ఎల్లంపల్లి ద్వారా నీటిని అందిస్తున్నారు. ఇప్పుడు సకాలంలో ఈ చెరువుల మరమ్మతులు చేసి నీరందించకపోతే సగం విస్తీర్ణంలోనూ పంట సాగు చేసే పరిస్థితి లేదు. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచే చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లోని దాదాపు 60 చెరువులు, కుంటలను ప్రతి యాసంగి సీజన్‌లో నింపుతున్నారు. ఆయా చెరువులు నిండితేనే ఎండాకాలంలోనూ భూగర్భజలాలు అందుబాటులో ఉంటున్నాయి. ప్రస్తుతం వానాకాలం పంట కోతలు పూర్తయ్యాయి. యాసంగి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వచ్చే ఏప్రిల్ వరకు సాగు నీరందించాల్సి ఉంటుంది. ఇంతవరకు ముంపు సమస్య తేల్చకుండా.. రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయకుండా సమస్యను ప్రభుత్వం జటిలంగా మారుస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే వచ్చే ఎండాకాలంలో గ్రామాలకు తాగునీటికీ ఇక్కట్లు ఎదురయ్యే ప్రమాదం లేకపోలేదు.

శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్‌కు మేడిపల్లి వినతి

నారాయణపూర్, గంగాధర జలాశయాల గండ్లను పూడ్చి చొప్పదండి నియోజకవర్గ రైతాంగానికి యాసంగి పంటకు నీరు అందించాలని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం గురువారం కరీంనగర్ కలెక్టర్ ఆర్‌వీకర్ణన్‌ను కలి శారు. నారాయణపూర్, మంగపేట, చర్లపల్లి, ఇస్తారుపల్లి గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏళ్లు గడుస్తున్నా.. పరిహారం తేల్చకుండా.. ముంపు బాధితులను బాధిస్తున్నారని, ఇప్పుడు గండి పడిన రిజర్వాయర్లకు మరమ్మతులు చేయకుండా తాత్సారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.

సిఐటియు రాష్ట్ర మహాసభల సందర్భంగా..

19న జెండాలు ఎగురవేయాలి

- కార్మికులకు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్ధిపేటలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరుగనున్న సిఐటియు రాష్ట్ర నాలుగో మహాసభల జయప్రదాన్ని కోరుతూ ఈ నెల 19న కార్మిక, పారిశ్రామిక వాడలు, మండల, జిల్లా కేంద్రాల్లో యూనియన్ అనుబంధ సంఘాలు జెండాలను ఎగురవేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లో సిఐటియు ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రతిమ బూనాలన్నారు. 23న సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే బహిరంగసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కార్మికుల స్థితిగతులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, మూడేళ్ల కాలంలో సిఐటియు నిర్వహించిన పోరాటాలు, సమ్మెలను సమీక్షించి భవిష్యత్ ఉద్యమాలకు రూపకల్పన చేస్తామన్నారు. షెడ్యూల్ పరిశ్రమల జిఒల జారీ, జిఒలను గెజిట్ చేయడం, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించడం, తదితర కార్మిక సమస్యలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై చర్చిస్తామన్నారు. కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు, విద్యుత్ సవరణ బిల్లు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలు తీర్మానాలు చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. మొదటి రోజు మహాసభలను సిఐటియు జాతీయ అధ్యక్షులు కె హేమలత, జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రారంభిస్తారని తెలిపారు. అఖిల భారత కేంద్రం నుంచి మహాసభల పరిశీలకులుగా జాతీయ ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు హాజరవుతారని చెప్పారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, తదితరులు

డంపింగ్ యార్డులో పేలుడు

- తండ్రీకొడుకులకు గాయాలు
- లోయర్ ట్యాంక్‌బండ్ సమీపంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చెత్త డంపింగ్ యార్డులో కెమికల్ డబ్బా పేలడంతో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్ గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లోయర్ ట్యాంక్ బండ్ స్నో వరల్డ్ సమీపంలో గురువారం జరిగింది. వివరాల్లోకెళ్తే.. కర్నూలు జిల్లా నాంచార్ల గ్రామానికి చెందిన చంద్రన్న, ఆయన కుమారుడు సురేష్ జెబిఎస్ మడ్‌ఫోర్డ్ ప్రాంతంలో నివాసముంటున్నారు. వారు ప్రతిరోజూ లోయర్ ట్యాంక్ బండ్ డంపింగ్ యార్డులో చెత్త సేకరిస్తూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో గురువారమూ చెత్త ఏరుకుంటుండగా వాల్ పెయింట్‌లకు ఉపయోగించే కెమికల్ రసాయనిక డబ్బా కనిపించింది. అది తెరవడానికి వారు ప్రయత్నించగా ఒక్కసారిగా పేలింది. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిద్దరినీ గాంధీ ఆస్పత్రికి తరలించారు. సురేష్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ మోహన్‌రావు తెలిపారు. పేలుడు సమాచారం అందుకున్న గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, బిఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు శోభన్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావుతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడి, మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ దృష్టికి తీసుకెళ్లి అన్ని విధాలుగా ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారు.

రంగారెడ్డిలో పోదార్ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు

- హయత్‌నగర్‌లో బ్రాంచ్ ప్రారంభం

హైదరాబాద్ : పోదార్ ఇంటర్నేషనల్ స్కూల్ తన నూతన శాఖను రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ఇది తమకు తొలి శాఖ అని పోదార్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్ మార్కెటింగ్ సీనియర్ జనరల్ మేనేజర్ విశాల్ షా తెలిపారు. గురువారం ఇక్కడ ఆయన బ్రాంచ్ అడ్మిన్ ఆఫీసర్ చైతన్యతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో తమ సంస్థకు 139 పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఈ నూతన సెంటర్ మూడు ఎకరాల్లో విస్తరించి ఉందన్నారు. పాఠశాల దాని ప్రారంభ దశలో ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్‌లను అందిస్తుందన్నారు. టాప్ గ్రేడ్ 5 వరకు మరియు ప్రతి తదుపరి సంవత్సరం, ఒక గ్రేడ్ జోడించబడుతుందన్నారు. నర్సరీ ఫీజును రూ.47,840గా నిర్ణయించామన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని రేణిగుంటలో ఓ బ్రాంచ్‌ను తెరిచామని.. త్వరలోనే నెల్లూరు, కడపలో కొత్త పాఠశాలలను అందుబాటులోకి తేనున్నామన్నారు.

బిజెపి విధానం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం

- కేరళలో ప్రత్యామ్నాయ విద్యావిధానం
- ఎస్ఎఫ్ఐ జాతీయ సంయుక్త కార్యదర్శి కెఎం సచిన్ దేవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నియంతృత్వ విధానాలతో దేశ ప్రజల హక్కులను హరిస్తుందని ఎస్ఎఫ్ఐ జాతీయ సంయుక్త కార్యదర్శి, కేరళ ఎమ్మెల్యే కెఎం సచిన్ దేవ్ అన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభలకు హాజరైన ఆయన గురువారం ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

"ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేలా కేంద్రం తీసుకొస్తున్న నూతన విద్యావిధానంకు ప్రత్యామ్నాయ విద్యావిధానం కేరళ రాష్ట్రం అమలు చేస్తుంది. కేరళలో ప్రభుత్వ విద్యకే తొలి ప్రాధాన్యం. తొలి నాళ్లలో ప్రాథమిక విద్య అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేశాయి. తర్వాత ఉన్నత విద్యపై దృష్టి సారించాం. అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యావిధానం వల్లే కేరళ రాష్ట్రం విద్యారంగంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. కార్పోరేట్ విద్యాసంస్థలను బాగుచేసేందుకే కేంద్రం ఎన్ఇపిని తీసుకొస్తుంది. విద్యావేత్తలు, మేధావులు, అందరూ ఎన్ఇపిని వ్యతిరేకించాలి. దేశంలో విశ్వవిద్యాలయాలు ప్రస్తుతం చాలా సమస్యలతో సతమతమవుతున్నాయి. వర్సిటీల వాతావరణాన్ని ఆర్ఎస్ఎస్ నడిపిస్తున్న కేంద్ర ప్రభుత్వం కలుషితం చేసింది. గవర్నర్‌ను వర్సిటీల ఛాన్సలర్ బాధ్యతల నుంచి తప్పిస్తూ కేరళ రాష్ట్ర అసెంబ్లీ బిల్ కూడా పాస్ చేసింది. కమర్షియలైజేషన్, కమ్యునలైజేషన్, ప్రయివేటైజేషన్‌తో విద్యారంగాన్ని బిజెపి ప్రభుత్వం నాశనం చేసింది" అని ఆయన తెలిపారు. ప్రభుత్వ రంగ విద్యను బలోపేతం చేయడం, విద్యార్థుల హక్కుల రక్షణతో పాటు దేశ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఈ మహాసభల్లో చర్చించి పరిష్కారమార్గాలు అన్వేషిస్తామని చెప్పారు.

బిఆర్ఎస్ నుంచి ఇక విఆర్ఎస్

- కెసిఆర్ పాలనంతా అవినీతి మయం : జెపి నడ్డా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఆర్ఎస్ నుంచి బిఆర్ఎస్‌గా మారిన కెసిఆర్ పార్టీ త్వరలోనే విఆర్ఎస్ తీసుకుంటుందని బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా వ్యాఖ్యానించారు. కరీంనగర్ ఎంపి సంజయ్ చేపట్టిన ప్రజాసంగ్రామ యాత్ర గురువారం కరీంనగర్‌లో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జెపి నడ్డా మాట్లాడారు. ఈ యాత్ర ఇక్కడితో ఆగేదికాదని, మరిన్ని రోజులు కొనసాగుతోందని అన్నారు. ప్రజల గోస.. బిజెపి భరోసా అని, సాలు దొర.. సెలవు దొర నినాదం పక్కాగా జరుగుతుందని అన్నారు. వచ్చేప్పుడు తననూ అడ్డుకునేందుకు ప్రయత్నించారని, ఇది కెసిఆర్ అహంకారానికి నిదర్శనమని, ఆయన్ను త్వరలోనే ప్రజలు చెత్తకుప్పలో వేస్తారంటూ జోస్యం చెప్పారు. కెసిఆర్ ప్రభుత్వం అవినీతి, అరాచక, ప్రజా వ్యతిరేకంగా సాగుతుందని, ఆయన పాలనకు గుడ్‌బై చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు. మోడీ పాలనలోనే సబ్ కా సాత్.. సబ్ కా విశ్వాస్ నిరూపిత మైందంటూ వివరించారు. కేంద్రం నుంచి జాతీయ రహదారుల కింద భారీఎత్తున నిధులు మంజూరు చేశామని, జల్ జీవన్ మిషన్ కిందా పెద్దఎత్తున నిధులు ఇచ్చామని చెప్పారు. మిగులు రాష్ట్రాన్ని కెసిఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. కెసిఆర్ పాలనలో రాష్ట్రం రూ.3.29 కోట్ల అప్పుల కుప్పగా మారిందని, ఆయన కూతురు కవిత అవినీతిలో కూరుకుపోయారని విమర్శించారు. 'ధరణి పోర్టల్' పేరుతో.. టిఆర్ఎస్ నేతలు పేదల భూములు గుంజుకుంటున్నారని ఆరోపించారు. ఒవైసికి భయపడే సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా కెసిఆర్ నిర్వహించడం లేదన్నారు. తన ప్రసంగమంతా ఆయనపైనా, ఆ కుటుంబంపైనా విమర్శలతోనే సాగడం గమనార్హం. ముగింపు యాత్రలో ఎంపి బండి సంజయ్ సహా బిజెపి నేతలు పాల్గొన్నారు.

నగరంలో 5జి ప్లస్‌తో అల్ట్రా ఫాస్ట్ కనెక్టివిటీ

ఎయిర్‌టెల్

ప్రజాశక్తి-హైదరాబాద్

నగరవాసులు ఇప్పుడు అల్ట్రా ఫాస్ట్ 5జి కనెక్టివిటీని మెట్రో రైల్ ప్రయాణ సమయంలోనూ ఆస్వాదించవచ్చని భారతీ ఎయిర్‌టెల్ తెలిపింది. అదే విధంగా సికింద్రాబాద్, కాచిగూడా రైల్వే స్టేషన్‌లతో పాటుగా అతిపెద్ద బస్ టెర్మినల్ ఇమ్లీబన్ బస్ డిపో వద్ద ఆస్వాదించవచ్చని పేర్కొంది. గురువారం తమ ఈ విప్లవాత్మక 5జి సేవలను నగరంలో ప్రారంభించినట్లు వెల్లడించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో అందుబాటులోకి తెచ్చిన ఈ 5జి సేవలను తమ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరించడానికి కృషి చేస్తోందని తెలిపింది.



అధికారులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి జిల్లాలో పుష్కలంగా నీటి వనరులు

- రాష్ట్రంలోనే జిల్లాకు మొదటి స్థానం
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వనపర్తి జిల్లాలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయని, రాష్ట్రంలోనే భూగర్భ జల లభ్యతలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఇరిగేషన్ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటిపారుదల, వ్యవసాయ రంగాల అభివృద్ధిలో జిల్లా చాలా ముందంజలో ఉందని, గత రెండు వానాకాలం సీజన్లలో వర్షపాతం అధికంగా నమోదైందన్నారు. పాలమూరు- రంగారెడ్డి లెఫ్ట్ కెనాల్ -2, 3 కింద 52 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోందని తెలిపారు. అలంపూర్ నియోజకవర్గంలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. గోపాల్‌పేట, ఘనపూర్ మండలాల్లో 37 కిలో మీటర్ల మేర నీటి వనరులు ఉన్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ అడ్వైజర్ విజయ్ ప్రకాష్, చీఫ్ ఇంజినీర్లు హమీద్ ఖాన్, రఘునాథ్‌రావు, ఎస్ఇటి సత్యశీల రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్, అధికారులు, నీటి పారుదల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టిఎంయు ఒక్కటే.. మరో వర్గం లేదు

- టిఎంయు నూతన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఒక్కటేనని.. మరో వర్గం లేదని, అశ్వద్ధామరెడ్డి, తిరుపతికి టిఎంయు పేరు చెప్పే అర్హత లేదని టిఎంయు నూతన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.ఆర్.రెడ్డి, థామస్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్ రోడ్డులోని విఎస్‌టి ఫంక్షన్ హాల్‌లో టిఎంయు రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగులు తరలివచ్చి.. టిఎంయూకు ఏకపక్ష మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు 47 వేల మంది కార్మికుల మద్దతు ఉందన్నారు. ఆర్‌టిసి కార్మికులను, సంస్థను నిట్టనిలువునా ముంచింది అశ్వద్ధామరెడ్డి, తిరుపతిలేనని విమర్శించారు. యూనియన్ ఆఫీస్ కడతామని రూ.కోటి 75 లక్షలు దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల నుంచి చందా రూపంలో వసూలు చేసిన డబ్బులు టిఎంయుకు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. సమ్మె సమయంలో 31మంది కార్మికులు చనిపోతే ఒక్క కుటుంబాన్నీ పరామర్శించలేదన్నారు. జనరల్ బాడీ సమావేశంలో టిఎంయు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మొత్తం 66 మందితో కమిటీని ఏర్పాటు చేయగా.. టిఎంయు రాష్ట్ర అధ్యక్షుడిగా ఏ.ఆర్.రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా థామస్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కమలాకర్‌గౌడ్, ముఖ్య ఉపాధ్యక్షులుగా జీపీఆర్ రెడ్డి, పీఎస్ రెడ్డి, ఎల్.మారయ్య, బి.యాదయ్య, జాయింట్ సెక్రటరీలుగా బి.నరేందర్, ఎల్.బి.రెడ్డి, రాఘవరెడ్డిని ఎన్నుకున్నారు.

నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివిధ యూనివర్సిటీలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లను తయారు చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం డిసిపి ఎం.రాజేష్ చంద్రా మీడియాకు వివరాలు వెల్లడించారు.

నాంపల్లికి చెందిన మొహ్మద్ ఎహ్తేషామ్ ఉద్దీన్ హుస్సేయిన్, టోలిచౌకీకి చెందిన మొహ్మద్ అబ్దుల్ ఖాదర్, అంబర్‌పేటకు చెందిన మొహ్మద్ ఇమ్రాన్‌తోపాటు మరో ఇద్దరు ఒక ముఠాగా ఏర్పడ్డారు. మొహ్మద్ ఎహ్తేషామ్ ఉద్దీన్ హుస్సేయిన్ నాంపల్లిలో 'స్టడీ అఫైర్స్ ఇంటర్నేషనల్ ప్రయివేటు లిమిటెడ్' పేరుతో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. యుకె నుంచి తిరిగొచ్చిన ఇమ్రాన్ అంబర్‌పేటలో 'వీర సిటీ సర్వీసెస్' పేరుతో మీ సేవాను నడిపిస్తున్నాడు. మలక్‌పేట్‌కు చెందిన ఆల్తాఫ్ 'క్యారియర్ వింగ్' కన్సల్టెన్సీని హిమాయత్‌నగర్‌లో నిర్వహిస్తున్నాడు. మొహ్మద్ ఎహ్తేషామ్ ఉద్దీన్ హుస్సేయిన్ తన వద్ద పనిచేస్తున్న ఖాదర్‌తో కలిసి సులువుగా డబ్బులు సంపాదించాలని పథకం వేశాడు. నిరుద్యోగులకు, విద్యార్థులకు, విదేశాలకు వెళ్లేవారికి అవసరమైన విద్యార్హత నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి అందిస్తే సులువుగా డబ్బులు సంపాదించొచ్చని ఆలోచించారు. ఈ మేరకు ఇతర రాష్ట్రాలకు చెందిన వారితో స్నేహం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నేషనల్ స్కూల్ ఆఫ్ ఓపెన్ స్కూల్, చెన్నైకి చెందిన అన్నా యూనివర్సిటీ, తమిళనాడుకు చెందిన తిరువల్లువర్ విశ్వవిద్యాలయం, సత్యభామ విశ్వవిద్యాలయం, మీరట్‌కు చెందిన చరణ్‌సింగ్ యూనివర్సిటీ, పూణే, సిక్కిం, గుజరాత్‌తోపాటు తదితర రాష్ట్రాలకు చెందిన యూనివర్సిటీల సర్టిఫికెట్లను తయారీ చేస్తున్నారు. అవసరమైన వారికి రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న హైదరాబాద్ సౌత్‌జోన్ ఇన్‌స్పెక్టర్.. ఎస్ రాఘవేంద్ర డిసిపి ఆదేశాలతో ప్రత్యేక నిఘా వేశారు. ఎస్ఐలు కె నర్సింహులు, వి నరేందర్, ఎన్ శ్రీశైలం, షేక్ బురాన్‌తోపాటు నాంపల్లి పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను అరెస్టు చేశారు. ఈ ముఠాతో సంబంధమున్న వారిని, పరారీలో ఉన్న వారిని అదుపులోకి తీసుకుంటామని డిసిపి తెలిపారు.



నకిలీ సర్టిఫికెట్లను ప్రదర్శించి వివరాలు తెలుపుతున్న సిపి ఎం రాజేష్ చంద్రా, సంబంధిత అధికారులు

బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి : విహెచ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడంతోపాటు బిసిల జనగణన చేయాలని మాజీ ఎంపి వి హనుమంతరావు డిమాండ్ చేశారు. దేశంలో బిసి క్రిమిలేయర్ ఎత్తేయాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీ పదవుల్లో వెల్లువెత్తున్న అసంతృప్తిపై పిసిసి చీఫ్ మాట్లాడాలని కోరారు. బిఆర్ఎస్ ఎంతవరకు సక్సెస్ అవుతుందో వేచి చూడాల్సిందేనన్నారు. చైనా విషయంలో ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే చొరవ అభినందనీయమని చెప్పారు. ఈనెల 19న కాంగ్రెస్ వార్ రూమ్ సీజ్‌పై అన్ని విషయాలు కోర్టుకు తెలియజేస్తామని పిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి చెప్పారు.

మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ

- రాష్ట్రంలో పది వేల సిసి కెమెరాలతో నిఘా
- ములుగు, భద్రాద్రి జిల్లా పోలీసుల పనితీరు భేష్
- మీడియాతో రాష్ట్ర డిజిపి మహేందర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



డిజిపి మహేంధర్ రెడ్డి

తెలంగాణను మావోయిస్టు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం పోలీసు వ్యవస్థను పటిష్ట పరచడం వల్ల శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర డిజిపి మహేందర్ రెడ్డి అన్నారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పోలీసుల పనితీరు భేష్‌గా ఉందని, వారి కృషి వలన మావోయిస్టు ప్రాభల్యం రెండు జిల్లాల్లో పూర్తిగా తగ్గిందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు ప్రాంతం ఛత్తీస్‌గఢ్ సరిహద్దు చర్ల ప్రాంతాల్లోని ఆలుబాకా పోలీస్ బేస్ క్యాంపును ఆయన గురువారం సందర్శించారు. అనంతరం హెలికాప్టర్‌లో నేరుగా కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, హేమచంద్రపురం పోలీస్ బెటాలియన్ క్యాంపునకు, అక్కడి నుంచి చర్ల అనంతరం హెలికాప్టర్ ద్వారా హేమచంద్ర పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు చేరుకున్నారు. అనంతరం పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుగు ప్రయాణంలో మీడియాతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో మావోయిస్టుల అణచివేతకు జిల్లా పోలీస్ స్పెషల్ పార్టీ తీవ్రంగా కృషి చేశారని తెలిపారు. ప్రజలు, పోలీసులు సమిష్టిగా పనిచేయడం వల్ల ములుగు, భద్రాద్రి కొత్తగూడెం రెండు జిల్లాలలో మావోయిస్టు ప్రాభల్యం పూర్తిగా లేకుండా పోయిందని, నిరంతరం పోలీసు ఆపరేషన్ వలన ఇది సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉంటేనే పరిశ్రమలు నెలకొల్పేందుకు ఇతర ప్రాంతాల నుంచి పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తారని, తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది లక్షల సిసి కెమెరాల ద్వారా నిఘా పటిష్టం చేశామని, రాష్ట్ర పోలీస్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యంత్రంగంగా ఉందన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోనూ సిసి కెమెరాలు ఏర్పాటు చేసిన విషయాన్ని వెల్లడించారు. కార్యక్రమంలో భద్రాద్రి, ములుగు జిల్లాల ఎస్పిలు డాక్టర్ జి వినీత్, సంగ్రామ్ సింగ్ పాటిల్, కొత్తగూడెం ఒఎస్‌డి సాయి మనోహర్, ములుగు ఒఎస్‌డి గౌస్ అలాం, అడిషనల్ ఎస్పి శోభన్ కుమార్, భద్రాచలం, ములుగు, ఏటూరు నాగారం ఎఎస్పిలు రోహిత్ రాజు, అశోక్ కుమార్, సుధీర్, కె కేకర్, సిఆర్‌పిఎఫ్ కమాండెంట్లు ప్రశాంత్ ధర్, సంజీవ్ కుమార్, 6వ టిఎస్ఎఎస్‌పి బెటాలియన్ కమాండెంట్ రమణా రెడ్డి, డిఎస్పిలు వెంకటేశ్వర బాబు, రమణ మూర్తి, సత్యనారాయణ, జిల్లాలోని ఇతర పోలీసు అధికారులు, రెండు జిల్లాల స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.